# భవిష్యత్ భారతం

ఆయన పేరు చంద్రయ్య. వయసు రెండు వందల వేల సంవత్సరాలు దాటింది. వృద్ధాప్యంతో ముడతలుపడిన శరీరం కాదు ఆయనది... కండలు తీరిన దృఢకాయం. కుళ్ళిపోయిన వంకాయలా మారిన మొహం కాదాయనది... నిగనిగలాడుతున్న చెంపలు, గుబురుగా పెరిగిన మీసాలు... గంభీరంగా, హుందాగా ఉన్నాడు.

ఆరంతస్తుల భవనం... బెడ్‌రూమ్‌కి ఆనుకుని ఉన్న చిన్న బాల్కనీలో, రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చున్నాడు. ఆయన చేతిలో లాప్‌టాప్ ఉంది. సీరియస్‌గా లాప్‌టాప్‌లో ఏదో పనిచేసుకుంటున్న ఆయన లాల్చీ జేబులోంచి సెల్‌ఫోన్ మోగడంతో, జేబులోకి చేయి పెట్టి, ఫోన్ తీసి, ఓ బటన్ నొక్కాడు... ఆయన మొహంలో ఆనందం వెల్లివిరిసింది.

"హలో! సూర్యారావు... హవ్వార్యూ! ఏంటి ఇవాళ అలా ఉన్నావు.. కలర్ బాగా తగ్గిపోయావు... డార్క్ అయ్యావు... ఎంచేత? ఐసీ... అంటే భూమ్మీద పొల్యూషన్ అంతగా పెరిగిందన్నమాట. ఓకే... నేను ఫేస్ మాస్క్ పంపిస్తాను వాడు... ఏంటి? రాకెట్స్ కావాలా? పిల్లలు అక్కడ స్కూళ్లకు రోజు విడిచి రోజు వెడుతున్నారా? ఎందుకని? ట్రాఫిక్ దాటి వెళ్లేటప్పటికి పన్నెండు గంటలు పడుతోందా? ఓ గాడ్..." సెల్‌ఫోన్ లాల్చీ జేబులో పెట్టుకుని, తిరిగి లాప్‌టాప్‌లో తన ఆఫీసు వర్కు చేసుకోసాగాడు.

రెండు వందల వేల సంవత్సరాల చంద్రయ్య పాతిక సంవత్సరాల కుర్ర వాడిలా హుషారుగా, బలిష్టంగా, ఆరోగ్యంగా ఉన్నాడు. శాస్త్రజ్ఞులు కనిపెట్టిన ఆధునిక జెనోమ్ పద్ధతి ద్వారా ఆయన తన యవ్వనాన్ని జయించాడు.

ఆఫీసు ఫైల్స్ చూడడం పూర్తికాగానే, ఇంటర్‌నేషనల్‌గా ఏయే దేశాల్లో ఎంత టెక్నాలజీ కనుక్కున్నారు...ఎంత ఆధునిక పరిజ్ఞానం సాధించారు... అన్న విషయాలను ఆయన ఎంతో ఆసక్తిగా తెలుసుకుంటున్నాడు. అంతలో ఆయనకి దాహం వేసింది.

చేతికందుబాటులో ఉన్న స్విచ్ నొక్కాడు. కొన్ని నిముషాలకు ఏదో మిషన్ తిరుగుతున్న ధ్వని వినిపించింది. జర, జరలాడుతూ ఓ రోబోట్ వచ్చి అందమైన జార్‌లోంచి ఒక టాబ్లెట్ తీసి ఆయన నోట్లో వేసింది.

ఆయన ఆ టాబ్లెట్ చప్పరిస్తూ, థాంక్యూ డియర్ అన్నాడు. రోబోట్ మళ్లీ జర జరలాడుతూ లోపలికి వెళ్లిపోయింది.

ఇంతలో ఇరవై ఏళ్ళ కుర్రవాడు పరిగెత్తుకొచ్చాడు. వయసు ఇరవై అయినా, వాడు పదేళ్ల పిల్లవాడిలా ఉన్నాడు. వాడి ఒంటిమీద స్కూలు యూనిఫాం ఉంది. ఆ యూనిఫాం వ్యోమగాములు అంతరిక్షంలోకి వెళ్ళబోయే ముందు వేసుకునేదిగా ఉంది. వాడు వస్తూనే, 'హాయ్ గ్రాండ్‌పా...' అని పలకరించాడు.

ఆయన లాప్‌టాప్‌లోంచి తలెత్తి, చిరునవ్వుతో ఆ కుర్రవాడిని చూసి, "హలో! ఆర్మ్‌స్ట్రాంగ్... హవ్వార్యూ!" అని పలకరించి, "ఏంటి బాబూ! ఆలస్యమైందే" అని అడిగాడు.

"ఏం చేయను? రాకెట్ ఎంతసేపటికీ రాలేదు. చాలాసేపు వెయిట్ చేశాను..." అంటూ గోడకున్న స్విచ్ నొక్కాడు.

లోపల్నుంచి రోబోట్ జరజరా వచ్చి కుర్రవాడి కాళ్ళకున్న షూస్ తీసింది. డ్రెస్ మార్చి, మామూలు లాగూ, చొక్కా వేసింది. జార్‌లోంచి టాబ్లెట్ తీసి కుర్రవాడి నోట్లో వేసి, మళ్ళీ లోపలికి వెళ్లింది. రెండు నిముషాల్లో పేపర్ ప్లేటులో డ్రై ఫ్రూట్స్ తెచ్చి కుర్రవాడికిచ్చింది. అతను అక్కడే ఉన్న మరో కుర్చీలో కూర్చుని, ప్లేటు కుర్చీకున్న చెక్క మీద పెట్టాడు. కుర్చీకి ఎడంచేతి పక్కనున్న మీట నొక్కాడు. ప్లేటులో ఉన్న జీడిపప్పు లాంటి గింజలు ఒక్కొక్కటి ఆ కుర్రవాడి నోట్లోకి వెళ్తున్నాయి.

"ఐయామ్ వెరీమచ్ టైర్డ్ గ్రాండ్‌పా... నాకు సపరేట్‌గా ఓ రాకెట్ కొనివ్వండి. స్కూలు రాకెట్లో వెళ్ళి రాలేను. రాకెట్ సమయానికి రాదు. వచ్చినా హెవీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి... త్వరగా ఇంటికి చేర్చదు. ఐవాంట్ మై ఇండివిడ్యువల్ రాకెట్..."

"ష్యూర్ బాబూ! రేపే అమెరికా నుంచి రాకెట్ తెప్పిస్తాను. ఆ... ఇవాళ స్కూల్లో ఏం చెప్పారు బాబూ! ఎనీ న్యూ లెసన్" ఆ మాట వినగానే ఆ కుర్రవాడు కుర్చీలోంచి లేచి గట్టిగా నవ్వి, తిరిగి కుర్చీలో వాలి, పడీపడీ నవ్వసాగాడు. అతని నవ్వు చూసి ఆయన కంగారుపడిపోతూ చటుక్కున గోడకున్న స్విచ్ నొక్కాడు. జరజరా రోబోట్ వచ్చింది.

"చూడు... బాబు నవ్వీనవ్వీ అలిసిపోయాడు.... నువ్వేం చేస్తున్నావక్కడ? చూస్తూ కూర్చోకపోతే, సాయం చేయవచ్చుగా..."

"సారీ సర్..." రోబోట్ గరగరమంటూ శబ్దంచేసి అపాలజీస్ చెప్పింది. మరుక్షణంలో రోబోట్ నుంచి భయంకరమైన ధ్వని రాసాగింది.

ఆ కుర్రవాడు చటుక్కున నవ్వాపేసి, "స్టాప్... స్టాప్... స్టాపిట్..." అంటూ అరిచాడు. రోబోట్ టక్కున ఆగిపోయింది.

"వాటీజ్‌దిస్ గ్రాండ్‌పా... నా బదులు రోబోట్ నవ్వడం ఏంటి? రేపట్నించీ ఫుడ్ కూడా నా బదులు రోబోట్ తింటుందా?" అడిగాడు. రోబోట్ వికృతంగా మొహం పెట్టింది.

"నువ్వు అలిసిపోతావని" అంటూ నసిగాడాయన.

"సోవాట్... యుకెన్‌గో.." చిరాగ్గా రోబోట్ వైపు చూశాడా కుర్రాడు. రోబోట్ లోపలికెళ్ళిపోయింది.

"ఇంతకీ ఎందుకంతగా నవ్వావు?" అడిగాడాయన.

"ఏంలేదు గ్రాండ్‌పా... ఇవాళ మా స్కూల్లో చాలా చిత్రమైన సంగతి చెప్పారు. కొన్ని శతాబ్దాల క్రితం మనుషులంతా దాహమేస్తే మంచినీళ్లు తాగే వాళ్లంట... పైగా ఏవో జబ్బులు చేస్తే మనుషులు చనిపోయేవారట.. ఏమిటో వర్షాలు కురిసేవని చెప్పారు... అసలు వర్షం అంటే ఏమిటి గ్రాండ్‌పా?"

ఆయన గుబురు మీసాల చాటున గుంభనంగా నవ్వాడు. "సో! మీకివాళ చరిత్ర చెప్పారన్నమాట... గుడ్... వెరీ గుడ్... తెలుసుకోవాల్సిందే..."

"అది సరే... మంచినీళ్లేంటి? మనుషులు చనిపోవడం ఏమిటి? వర్షాలంటే ఏమిటి? నాకేం అర్థంకాలేదు. పైగా అప్పట్లో అందరూ బస్సులు, ఆటోలు, కార్లు ట్రాన్స్‌పోర్టుగా వాడేవారట. నాలాంటి పిల్లలను స్కూలుకి తీసుకెళ్ళడానికి రాకెట్స్ బదులు ఆటోలు వచ్చేవిటగా... అవి భూమ్మీదే, రెండు అడుగుల ఎత్తున తిరిగేవట. చాలా ఫ్రీక్వెంట్‌గా యాక్సిడెంట్స్ అయ్యేవట... అబ్బ! రియల్లీ ఇట్ వజ్ వెరీ ఎగ్జయిటింగ్... ఐ వాంట్ టు నో అబౌట్ వర్షం..."

"చెప్తాను... బాబూ! ఒకప్పుడు భూమ్మీద వేడికి సముద్రంలో, నదుల్లో, చెరువుల్లో నీరంతా ఆవిరిగా మారి, ఆకాశంలో మేఘాలుగా ఏర్పడుతుండేది. గాలికి ఆ మేఘాలు ఒకదాన్ని ఒకటి ఢీకొని, వర్షాన్ని కురిపించేవి. ఆషాఢమాసం అని ఒక తెలుగు మాసం ఉండేది. ఆ మాసాన్ని వర్షాకాలం అంటారు. అంటే

ఆ మాసం నుంచీ వర్షాలు కురవడం ప్రారంభమై మూడు నెలలపాటు కురిసేవి. రైతులని ఉండేవాళ్ళు... పాపం వాళ్ళంతా ఏవో విత్తనాలు అంటూ తీసుకొచ్చి ఫీల్డ్స్‌లో చల్లేవాళ్లు... ఆ విత్తనాలు వాన చినుకులకి మొలకెత్తడం ప్రారంభించి, వర్షాకాలం పూర్తి అయ్యే లోపల ఏపుగా ఎదిగి, చలికాలానికి కాపు కొచ్చేవి... అంటే ఆ విత్తనాల ద్వారా ఫుడ్ గ్రెయిన్స్ తయారుచేయడానికి రైతులు కష్టపడే వాళ్ళు... వాళ్ళని ఫార్మర్స్ అంటారు... ఎంతో ఎఫర్ట్స్ చేసేవాళ్ళట. వాళ్ళు కేవలం వర్షాల మీద ఆధారపడి బతికేవాళ్ళు... కానీ పాపం కొంతకాలం గడిచాక వాతావరణ కాలుష్యం ఏర్పడి వర్షాలు పడలేదు..”

“వాతావరణ కాలుష్యం అంటే ఏమిటి గ్రాండ్‌పా?”

“అంటే! జనాభా పెరుగుతున్న కొద్దీ, జీవితావసరాలు పెరిగాయి. అకామ డేషన్స్, కమ్యూనికేషన్ ఫెసిలిటీస్, ట్రాన్స్‌పోర్ట్, ఇండస్ట్రీస్ ఇలాంటి వాటి అవ సరం పెరిగింది. తత్ఫలితంగా భూభారం పెరిగింది. పరిశ్రమలు వదిలివేసే వేస్ట్ వలన, వాహనాల ద్వారా వెలువడే పెట్రోలు, డీజిల్ వగైరా ఇంధనాల ద్వారా వాయు కాలుష్యం, నీటి కాలుష్యం ఏర్పడింది. కాంక్రీట్ భవనాల పునాదుల తాకిడికి భూభారం పెరిగి, సహజ వనరులు దెబ్బతిన్నాయి. ప్రజల్లో స్వార్థం, ధనమదం, భోగలాలసత పెరిగి అన్యాయాలు, అక్రమాలు చేయడం ప్రారంభించి ఆహారపదార్థాలలో కల్తీ పదార్థాలు కలపడం ప్రారంభించారు. ఆఖరికి అన్నదాత అయిన రైతుకి సరఫరా చేసిన విత్తనాల్లో కూడా కల్తీ విత్తనాలు ఇచ్చి, ఉత్పత్తుల మీద దెబ్బతీశారు. ఈవిధంగా వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, పరిసరాల కాలుష్యం, ఆహార కాలుష్యం పెరిగిపోయి, సూర్యుని అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి, భూమినీ, మానవజాతిని సంరక్షించే ఓజోన్ పొర చిరిగిపోయింది... మనుషుల ఆరోగ్యం మీద, ఆయుష్షు మీదా దెబ్బకొట్టింది.

చెరువులు, నదులు, బావులు డ్రై అయిపోయాయి. వర్షాలు పడడం ఆగిపోయింది. ప్రజలంతా దాహంతో, ఆకలితో అలమటించేవారు. తింటానికి లేక, తాగడానికి లేక, పిల్లలు, స్త్రీలు, వృద్ధులు అందరూ అకాల మరణం చెందారు. అప్పుడున్న స్టేట్ అండ్ సెంట్రల్ గవర్నమెంట్స్ ఈ పరిణామాలన్నిటినీ పరిశీలించి, దీర్ఘంగా చర్చించి, ప్రపంచ దేశాల శాస్త్రజ్ఞులను అందరినీ ఆహ్వానించి, వర్షాలు కురవడానికి ఏదన్నా మార్గం ఆలోచించమన్నారు. ప్రకృతి కరుణించడం తప్ప చేసేదేంలేదని శాస్త్రజ్ఞులు అన్నారు. ప్రకృతి కరుణించాలంటే ఏం చేయాలి? అని అప్పటి ప్రభుత్వాధినేతలు అడిగారు. యజ్ఞాలు చేయాలి, పూజలు చేయాలి

అన్నారు శాస్త్రజ్ఞులు. వెంటనే వారు రాష్ట్రంలో, దేశంలో ఉన్న ధనాన్నంతా వెచ్చించి యజ్ఞాలు చేయించారు. కానీ ప్రకృతి కరుణించలేదు. సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చేసుకుంటున్నారు కదా! అదే మిమ్మల్నీ, మీ ప్రజలనూ రక్షిస్తుంది అని ఆకాశవాణి పలికింది. వెంటనే వారు సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధిపరచడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అప్పటికే రాష్ట్ర ఖజానా, దేశ ఖజానా కూడా చిల్లు పడడంతో, ఆధునిక సాంకేతిక విజ్ఞానం అమలుపరచడానికి, అభివృద్ధి పరచడానికి తగిన వనరులు, ధనం లభించలేదు.

అపర చాణుక్యుడిగా పేరుపొందిన ఆనాటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖజానా నింపడానికి, వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ప్రారంభించారు. అందులో భాగంగా ప్రజలు  కూర్చున్నా... నిలుచున్నా, నవ్వినా, ఏడ్చినా పన్నులు చెల్లించాలని ప్రకటించారు. అప్పటి దాకా ప్రజాస్వామ్య దేశంలో బతికిన ఆ ప్రజలు ఈ నిరంకుశుడి బాధలకు తాళలేక, ఆయన చెప్పినవిధంగానే పన్నులు కట్టారు. ఆవిధంగా రాబట్టిన డబ్బుతో, ఆధునిక విజ్ఞానం అంతులేనంతగా సాధించారు. అయినా, ఆ తరం ప్రజల జీవితాలను కాపాడలేకపోయారు.

కళ్లు విశాలం చేసుకుని, వింతగా వింటున్న కుర్రవాడు కుతూహలంగా అడిగాడు. “మరి ఆ కాలంలో ప్రజలు ఏం తినేవారు?”

“హుఁ... వేదాంతిలా నవ్వాడాయన. “రైతులు సంవత్సరమంతా కష్టపడి వరి, గోధుమ, మొక్కజొన్న, కందులు, పెసలు, రాగులు అనే ధాన్యాలను, వంకాయలు, టమాటాలు, బెండకాయలు, సొరకాయలు, పొట్లకాయలు అనే కాయగూరలను, మామిడి, జామ, అరటి, బొప్పాయి అనే పండ్లనూ పండించారు. ఆనాటి స్త్రీలు వాటితో రుచికరమైన వంటలు చేసేవారు. ప్రజలంతా రకరకాల ఆహార పదార్థాలను తినేవారు. వాటిని అధికారంతో కొందరు, గూండాయిజంతో కొందరు ఉచితంగా తెచ్చుకుని పీకల దాకా తిని కొవ్వు పట్టి తిరిగేవాళ్ళు. కొందరు చెమటోడ్చి, కాయకష్టం చేసి, ధనం సంపాదించి, ఆ ధనంతో ఈ ఆహారపదార్థాలను కొనుక్కుని తినేవాళ్ళు. రైతులకీ, వినియోగదారులకీ మధ్య దళారీలుండే వాళ్ళు. వాళ్ళు అమాయకులైన రైతులను మోసంచేసి ఉత్పత్తి ధరల కన్నా ఎక్కువ ధరకి వినియోగదారులకి ఆహారపదార్థాలను అమ్మి కోట్లు సంపాదించి అహంకారంతో కన్నూ, మిన్నూ గానక ప్రవర్తించేవాళ్ళు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల మీద ప్రేమ, సానుభూతి వరదలా పొంగుతున్నట్లు నటించి, రైతుబజార్లంటూ ఏర్పాటుచేశాడు. దానివలన

కూడా రైతులకు లాభం కనిపించలేదు. వ్యవసాయంలో ముఖ్యమంత్రి రూపొందించిన ఆధునిక పద్ధతులేవీ సామాన్య రైతులకు అందుబాటులోకి రాలేదు. ఇలా అనేక కారణాలతో రైతులు ఆర్థికంగా నష్టపోయి, ఆత్మహత్యలు చేసుకున్నారు. అందుకే ఇప్పుడు పండించే నాథుడు లేక పంటలనేవి లేవు. శాస్త్రజ్ఞులు సాధించిన ప్రగతికి నిదర్శనంగా మనకి ఈ టాబ్లెట్లు, డ్రైఫ్రూట్స్ మిగిలాయి. ఈ లాప్‌టాప్‌లు, రాకెట్లు అనుభవిస్తున్నాం. అప్పుడు మనుషులు చేసే పనిని ఇప్పుడు మనకు రోబోట్స్ చేస్తున్నాయి. ఇది సాంకేతిక యుగం బాబూ... ఇక్కడ మనిషికి ఆయుష్షు పెరిగింది. యవ్వనం శాశ్వతం అయింది. కానీ, అనుభూతులూ, ఆనందాలు లేవు. జీవితం అంటే, జీవన మాధుర్యం అంటే తెలియదు. అదంతా గడిచిన కాలం... కరిగిపోతే తిరిగిరానిది కాలం... ఇక ఆ కాలం రాదు బాబూ..."

"గ్రాండ్‌పా...చాణుక్యుడు అన్నారే... ఆయనెవరు?"

ఆయన నిట్టూర్చాడు. "హుం... అది మరో చరిత్ర. ఇంకెప్పుడైనా చెప్తాను... నిద్రొస్తోంది గుడ్‌నైట్..."

చంద్రయ్య నెమ్మదిగా కుర్చీలోంచి లేచి మనవడికి గుడ్‌నైట్ చెప్పి, లిఫ్ట్‌లో తన బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు.

కూర్చున్న కుర్చీలోనే ఆ కుర్రవాడు నిస్తేజంగా వెనక్కివాలి పైకి చూశాడు. ట్యూబులైట్లూ, నియాన్ లైట్లు, మెర్క్యూరీ లైట్లు చిన్నచిన్న చుక్కల గుంపులుగా కనిపించాయి. అసహనంగా కదిలి అనుకున్నాడు. "ఛ... ఈ టైంలో కూడా అక్కడ ఇంత ట్రాఫిక్కా? ఇన్ని విమానాలు ఎక్కడినుంచి వస్తున్నాయో... ఈ జనాలకి పనీపాటా లేదా? ఎప్పుడూ ప్రయాణం చేస్తూనే ఉంటారా? ఏం మనుషులో!" గోడకున్న స్విచ్ నొక్కాడు.

రోబోట్ కొన్ని క్షణాలు ఆలస్యంగా వచ్చింది.

"వాట్ హాపెండ్? ఇంత లేట్‌గానా వచ్చేది? ఏం చేస్తున్నావు ఇంతసేపూ?"

"సారీ! సర్... మీ హోంవర్క్ ఇప్పుడే కంప్లీట్ చేశాను..."

"ఓకె... టేక్ మీ టు బెడ్‌రూం...' ధీమాగా అన్నాడు.

రోబోట్ కుర్రవాడిని ఎత్తుకుని లిఫ్ట్ వైపు నడిచింది.

***

***(27 అక్టోబర్ 2002, ఆదివారం ప్రజాశక్తి)***